ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 తమిళనాడు TAMILNADU
గురువారం 11 జూలై 2024



## నేడు 'ప్రజలతో ముఖ్యమంత్రి'

● ధర్మపురిలో స్టాలిన్ శ్రీకారం

చెన్నై, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గ్రామీణ ప్రాంతాల ప్రజలతో భేటీ అయ్యేందుకు సిద్ధమయ్యారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేలా 'ప్రజలతో ముఖ్యమంత్రి' పేరుతో కొత్త పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇప్పటివరకూ నగరాలకే పరిమితమైన ఆ పథకాన్ని గ్రామీణ ప్రాంతాలకు విస్తరింపజేయడానికి స్టాలిన్ సిద్ధమవుతున్నారు. ధర్మపురి జిల్లా పాళయంపుదూరులో గురువారం ఉదయం ఆయన ఈ పథకానికి శ్రీకారం చుట్టనున్నారు. ప్రభుత్వ శాఖల సేవలన్నీ ప్రజలకు త్వరితగతిన చేరేందుకుగాను ముఖ్యమంత్రి ప్రజల వద్దకే వెళ్ళి వారి సమస్యలను అడిగి తెలుసుకోనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే నిమిత్తం ఆయన గురువారం ఉదయం నగరం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి సేలం జిల్లా ఓమలూరు విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి కారులో బయలుదేరి ధర్మపురి జిల్లా పాళయంపుదూరు గ్రామానికి చేరుకుని 'ప్రజలతో ముఖ్యమంత్రి' పథకానికి శ్రీకారం చుడతారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ధర్మపురి జిల్లా కలెక్టర్ శాంతి, పోలీసు ఉన్నతాధికారులు తగు ఏర్పాట్లు చేపడుతున్నారు.

## సార్వత్రికంలో ఓటమిపై అన్నాడీఎంకే పోస్టుమార్టం

● లోక్‌సభ ఎన్నికల్లో పరాజయంపై నియోజకవర్గాల వారీగా ఈపీఎస్ సమీక్ష



సీనియర్లకు పార్టీ గుర్తింపు కార్డులు అందజేస్తున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి

ప్యారీస్, జూలై 10: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పరాజయానికి గల కారణాలను తెలుసుకొనేందుకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నియోజకవర్గాల వారీగా పార్టీ నిర్వాహకులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నారు. బుధవారం నుంచి ఈ నెల 19వ తేది వరకు 10 రోజుల పాటు రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో సాయంత్రం 4 గంటలకు ఈ సమావేశం జరుగుతుంది. తొలి రోజు కాంచీపురం పార్లమెంటు నియోజకవర్గ పార్టీ నిర్వాహకులతో 4 నుంచి 5 గంటలు, శ్రీపెరుంబుదూర్ నిర్వాహకులతో 5 నుంచి 6 గంటల వరకు ఈపీఎస్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో అన్నాడీఎంకే ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు, జిల్లా కార్యదర్శులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించకుండా నిర్లక్ష్యం చూపిన వారిని ఓటమికి గల కారణాలపై ఈపీఎస్ ప్రశ్నించారు. 10 రోజుల సమావేశాల అనంతరం అభ్యర్థుల విజయానికి కృషిచేయకుండా నిర్లక్ష్యం చూపిన వారిపై పార్టీ పరంగా చర్యలు చేపట్టడంతో పాటు వారిని పార్టీ పదవుల నుంచి తొలగించే చర్యలు కూడా ఈపీఎస్ తీసుకుంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులుదీరిన మహిళా ఓటర్లు



### 13న ఓట్ల లెక్కింపు...

విక్రవాండి ఉప ఎన్నికలో ఓట్ల లెక్కింపు ఈ నెల 13న జరుగనుంది. బుధవారం పోలింగ్ ముగియడటంతో భారీ భద్రతా ఏర్పాట్ల నడుమ ఈవీఎంలను పనైపురం ప్రభుత్వ మహోన్నత పాఠశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించి మూడంచెల భద్రతా ఏర్పాట్లు అమలు చేశారు. 13 ఉదయం ఎనిమిది గంటలకు స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రానికి చేర్చి అభ్యర్థుల ఏజెంట్లు, ఎన్నికల పరిశీలకులు, కౌంటింగ్ అధికారుల సమక్షంలో ఓట్లను లెక్కించనున్నారు.

# 77.73 శాతం పోలింగ్

● ప్రశాంతంగా విక్రవాండి ఉప ఎన్నిక

చెన్నై, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా విక్రవాండి శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నిక పోలింగ్ చెదురుమదురు సంఘటనల మినహా మొత్తం మీద ప్రశాంతంగా ముగిసింది. ఈ నియోజకవర్గంలో 77.73 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. ఈ నియోజకవర్గంలో డీఎంకే తరఫున అన్నియూరు శివా, పీఎంకే తరఫున సి.అన్బుమణి, నామ్ తమిళర్ కట్చి తరఫున డాక్టర్ అభినయ సహా 29 మంది అభ్యర్థులు పోటీచేశారు. అన్నాడీఎంకే ఈ ఎన్నికలను బహిష్కరించడంతో త్రిముఖపోటీ ఏర్పడింది. అన్నాడీఎంకే ఓట్ల కోసం పీఎంకే, నామ్ తమిళర్ కట్చి పార్టీలు పోటీపడ్డాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. నియోజకవర్గంలోని 276 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2.37లక్షల మంది వరకు ఓటర్లుండగా 552 ఈవీఎంలు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ రెండు ఈవీఎంల చొప్పున ఏర్పాటయ్యాయి. నియోజకవర్గమంతటా 1355 మంది పోలింగ్ సిబ్బంది పనిచేశారు. పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఉదయం ఏడుగంటలకు డీఎంకే అభ్యర్థి అన్నియూరు శివా తన స్వస్థలమైన అన్నియూరు పోలింగ్ కేంద్రానికి వెళ్ళి మొదటి వ్యక్తిగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. పీఎంకే అభ్యర్థి సి.అన్బుమణి పనైమరం పోలింగ్ కేంద్రంలో ఓటేశారు. పురుషుల కంటే మహిళా ఓటర్లే పోలింగ్ కేంద్రాల వద్ద పెద్ద సంఖ్యలో ఓటేశారు. ఉదయం తొమ్మిది గంటలకల్లా 12.94 శాతం పోలింగ్ నమోదైంది. ఆ తర్వాత ఉదయం 11 గంటలకు 29.97 శాతానికి పెరిగింది. మధ్యాహ్నం 3 గంటలకల్లా పోలింగ్ 64.44 శాతానికి చేరింది. సాయంత్రం ఆరుగంటలకు 77.73 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు ప్రకటించారు.



ఓటు వేస్తున్న వృద్ధురాలు

### పోలింగ్ ఆఫీసర్‌పై తేనెటీగల దాడి

విక్రవాండి ఉన్నతపాఠశాల పోలింగ్ కేంద్రంలోని ఓ గది పైభాగంలో తేనెపట్టు ఉంది. ఈ విషయం తెలియని పోలింగ్ సిబ్బంది పోలింగ్ ప్రారంభించిన కొద్ది సేపటికి తేనెటీగలు సిబ్బందిని చుట్టుముట్టాయి. వాటి దాడిలో పోలింగ్ ఆఫీసర్ ప్రభాకరన్ గాయపడ్డారు. వెంటనే వైద్యులు ఆయనకు ప్రాథమిక చికిత్స చేశారు.

### మహిళకు కత్తిపోట్లు...

విక్రవాండి సమీపం కొనపాళయం పోలింగ్ కేంద్రం వద్ద బుధవారం మధ్యాహ్నం ఓటేయడానికి క్యూలైన్‌లో నిలిచిన కనిమొళిపై ఏళుమలై అనే వ్యక్తి కత్తితో దాడి జరిపి పారిపోయిన సంఘటన తీవ్ర ఉద్రిక్తకు దారి తీసింది. వితంతువైన కనిమొళి ఏళుమలైతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఇటీవల ఆమెకు మరో వ్యక్తితో సంబంధం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న ఏళుమలై ఆమెను పలుమార్లు మందలించినా మాట వినలేదు. దీంతో ఆమెపై కోపంతో ఉన్న ఏళుమలై పోలింగ్ కేంద్రం వద్ద నిల్చిన కనిమొళిపై కత్తితో దాడి జరిపి పారిపోయాడు. గాయపడిన కనిమొళిని పోలీసులు చికిత్స నిమిత్తం ముండియంబాక్కం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కంజనూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని ఏళుమలైని అరెస్టు చేశారు.

# 22 నుంచి ఇంజనీరింగ్ కౌన్సెలింగ్

విడుదలైన ర్యాంకుల జాబితా



ర్యాంకుల జాబితా విడుదల చేస్తున్న సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ వీరరాఘవరావు

ప్యారీస్, జూలై 10: రాష్ట్రంలో బీఈ, బీటెక్ తదితర కోర్సులకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సంబంధించిన ర్యాంకుల జాబితా విడుదలైంది. బుధవారం ఉదయం గిండిలోని అన్నా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఈ జాబితాను సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ వీరరాఘవరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ర్యాంకుల జాబితా వివరాల కోసం విద్యార్థులు టీటీట్ట్ప్ప్సేజీజ్యా.ాటజ అనే వెబ్‌సైట్ ద్వారా చూడవచ్చన్నారు. ఈ నెల 29వ తేది నుంచి జనరల్ కేటగిరి విద్యార్థులకు కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో 450కు పైగా ఇంజనీరింగ్ కళాశాలలున్నాయని, అందులో అన్నా విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలలు, ప్రభుత్వ ప్రభుత్వ రాయితీ పొందుతున్న ఇంజనీరింగ్ కళాశాలలు, స్వయం ప్రతిపత్తి ఇంజనీరింగ్ కళాశాలల్లో అందుబాటులో ఉన్న బీఈ, బీటెక్ కోర్సుల్లో సుమారు 2 లక్షల సీట్లు ప్రభుత్వ కోటా కింద కేటాయించినట్లు తెలిపారు. వీటిని సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్ జనరల్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీచేయనున్నట్లు వివరించారు.

### 29 నుంచి జనరల్ కేటగిరీ కౌన్సెలింగ్

ఇదిలా వుండగా ఈ విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ కోర్సులలో ప్రభుత్వ కోటా సీట్లలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ మే 6వ తేదీతో ముగిసింది. ఆ తర్వాత టీచర్లు, విద్యార్థుల అభ్యర్థన మేరకు జూన్ 11 వరకు గడువు పొడిగించారు. మొత్తం 2.53లక్షల మందికి పైగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 1,98,853 మంది ఫీజు కూడా చెల్లించి రసీదు డౌన్‌లోడ్ చేసుకున్నారు. వీరి సర్టిఫికెట్లను జూన్ 13 నుంచి 30వ తేది వరకు ఆన్‌లైన్‌లో పరిశీలించారు. ఈ నేపథ్యంలో, మొత్తం 65 మంది విద్యార్థులు పూర్తిస్థాయి కటాఫ్ మార్కులు పొందారు. 200లకు 200 మార్కులు పొంది చెంగల్పట్టుకు చెందిన దోసిత లక్ష్మి మొదటి స్థానం, తిరునల్వేలి జిల్లాకు చెందిన నిరంజన రెండో స్థానం, నామక్కల్‌కు చెందిన గోకుల్ మూడవ స్థానంలో నిలిచారు. 6 నుంచి ప్లస్ టూ వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థుల 7.5 శాతం రిజర్వేషన్ కోటాలో సేలం జిల్లాకు చెందిన రావణి 199.5 మార్కులతో ప్రథమ స్థానం, కోవై జిల్లాకు చెందిన కృష్ణ అనూప్ రెండో స్థానం, వేలూరు జిల్లాకు చెందిన శరవణన్ తృతీయ స్థానం దక్కించుకున్నారు. జూలై 22వ తేది ప్రారంభం కానున్న కౌన్సెలింగ్ సెప్టెంబరు 9 వరకు జరుగనుంది. ఇందులో 7.5 శాతం రిజర్వేషన్ కోటాలోని ప్రత్యేక కేటగిరీకి ఈనెల 22న కౌన్సెలింగ్ జరుగుతుంది. జనరల్ కేటగిరీలో ప్రత్యేక విభాగానికి చెందిన విద్యార్థులకు కౌన్సెలింగ్ 25న ప్రారంభం కానుంది. అలాగే జనరల్ కేటగిరి కౌన్సెలింగ్ 29వ నుంచి జరుగనుంది.

# ఆర్‌ఎస్ భారతిని జైలుకు పంపిస్తాం

సైదాపేట కోర్టు వద్ద అన్నామలై శపథం

చెన్నై, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి కల్తీసార సంఘటనతో తనకు, తన వర్గానికి సంబంధాలున్నాయంటూ తప్పుడు ఆరోపణలు చేసిన డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్‌ఎస్ భారతిని జైలుకు పంపి తీరుతానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై శపథం చేశారు. బుధవారం ఉదయం ఆయన సైదాపేట కోర్టులో ఆర్‌ఎస్ భారతిపై పరువునష్టం దావా వేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... కళ్లకుర్చి కల్తీసారా తాగి 65 మంది మృతి చెందిన సంఘటనపై మీడియాతో మాట్లాడిన ఆర్‌ఎస్ భారతి ఆ సంఘటనకు అన్నామలై కారణమంటూ ఆరోపించారన్నారు. అంతటితో ఆగకుండా ఆ కల్తీసారాను తానే ఎక్కడి నుంచో తీసుకెళ్లి కళ్లకుర్చికి చేర్చినట్లు కూడా ఆరోపణలు చేశారన్నారు. ఆర్‌ఎస్ భారతి చేసిన ఆరోపణలు తనను తీవ్రంగా బాధపెట్టాయని, రాజకీయాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావాలనే లక్ష్యంగా గత మూడేళ్లుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా సేవ చేస్తున్నట్టు తెలిపారు. ఎంతో మంది రాజకీయనేతలు తన పరువు ప్రతిష్టలను దిగజార్చే రీతిలో ఆరోపణలు చేసినా, తనపై పరువు నష్టం దావా వేసినా తాను పోటీపడి వారిపై ఎలాంటి కేసులు వేయలేదన్నారు. అయితే డీఎంకేకు చెందిన సీనియర్ నాయకుడైన ఆర్‌ఎస్ భారతి ఇలా తనపై అవాస్తమైన ఆరోపణలు చేయడం గర్హనీయమని, అందుకే ఆయనపై కోటి రూపాయల నష్ట పరిహారం చెల్లించాలని, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ పరువు నష్టం దావా వేశానని చెప్పారు. ఆర్‌ఎస్ భారతి చెల్లించే నష్టపరిహారాన్ని కళ్లకుర్చి కల్తీసారా బాధితులందరికీ పంపిణీ చేస్తానని అన్నామలై చెప్పారు. ఈ కేసును సమర్థవంతంగా నడుపబోతున్నానని, సీనియర్ న్యాయవాదులను కూడా రంగంలోకి దింపనున్నానని, త్వరలో సమన్లు జారీ అవుతాయని చెప్పారు. ఏది ఏమైనప్పటికీ ఈ కేసులో ఆర్‌ఎస్ భారతిని జైలుకు పంపటం ఖాయమని అన్నామలై తెలిపారు. రెండేళ్లకు ముందు ఆర్‌ఎస్ భారతి తనను కుర్రకుంక అంటూ యెద్దేవా చేశారని, ఎంతోమందిని తాను జైలుకు పంపానని, తన చేతి రేఖలు శుభ్రంగా ఉన్నాయని, ఈ కేసులో తప్పకుండా ఆయన జైలుకెళతారనే నమ్మకం తనకుందన్నారు. కళ్లకుర్చి కల్తీసారా సంఘటనపై, నగరంలో జరిగిన బీఎస్పీ నేత ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసుపై సీబీఐ విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.



సైదాపేట కోర్టులో హాజరయ్యేందుకు వెళుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

### సెల్వపెరుంతగై నేర చరిత్ర అందరికీ తెలిసిందే...

టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై నేరచరిత్ర రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందేనని, గూండా చట్టంలో జైలు శిక్ష అనుభవించి రాష్ట్రకాంగ్రెస్ అధ్యక్ష పదవిని చేపట్టిన ఏకైక నాయకుడు ఈయనేనని అన్నామలై విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి జయలలిత హయాంలో పోలీసులు ఆయనను అరెస్టు చేయడానికి వెళ్లగా పారిపోతూ కిందపడి కాలిని విరగగొట్టుకున్న వ్యక్తి కూడా ఆయననే విమర్శించారు. సెల్వపెరుంతగైపై గూండాచట్టం ప్రయోగించింది మాజీ ముఖ్యమంత్రి జయలలితే అని అందరికీ తెలిసినా, ఆర్‌ఎస్‌ఎస్, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే కారణమంటూ తప్పుడు సమాచారం చెబుతున్నారని, లండన్‌లో ఆయనకు అక్రమ ఆస్తులు కూడా ఉన్నాయని, ఈ వివరాలను త్వరలో బహిరంగంగా ఆధారాలతో సహా ప్రకటిస్తానని అన్నామలై పేర్కొన్నారు.

### అన్నామలై తాటాకు చప్పుళ్లకు భయపడను - ఆర్‌ఎస్ భారతి

బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు అన్నామలై దాఖలు చేసిన పరువునష్టం దావాను చట్ట ప్రకారం ఎదుర్కొంటానని డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్‌ఎస్ భారతి అన్నారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కళ్లకుర్చి సంఘటనకు సంబంధించి రూ.2 కోట్లు చెల్లించాలంటూ నోటీసు పంపానని, ఇంతవరకూ ఆ నోటీసుకు అన్నామలై బదులివ్వలేదన్నారు. అన్నామలై ఎన్నో ఆరోపణలున్నాయని వాటిని న్యాయస్థానంలో వెల్లడిస్తానని చెప్పారు. చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో రూ.167 కోట్ల బంగారం పట్టుబడిన వ్యవహారం నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే అన్నామలై తనపై కేసు దాఖలు చేశారని, కేసులు తమకు, పార్టీకి కొత్త కావని, ఈ కొత్త కేసును కూడా చట్ట ప్రకారం ఎదుర్కొనేందుకు సిద్ధమేనని చెప్పారు.

## తిరుచ్చి రైల్వేస్టేషన్‌లో భారీగా నగలు, నగదు స్వాధీనం

పుదుకోట యువకుడి అరెస్టు

చెన్నై, జూలై 10 (ఆంధ్రజ్యోతి): చెన్నై - మంగళూరు ఎక్స్‌ప్రెస్‌లో ఎలాంటి రశీదులు లేకుండా తరలించిన రూ.2 కోట్ల విలువైన నగలు, నగదును రైల్వే భద్రతా విభాగం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న ఐటీ అధికారులు విచారణ జరుపుతున్నారు. తిరుచ్చి రైల్వే జోన్ భద్రతాదళ అధికారి అభిషేక్, ఇన్‌స్పెక్టర్ జెబాస్టియన్ తదితరులు తిరుచ్చి జంక్షన్ రైల్వేస్టేషన్‌లో బుధవారం ఉదయం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వేకువజామున చెన్నై నుంచి మంగళూరు వెళ్లే ఎక్స్‌ప్రెస్ తిరుచ్చి రైల్వే స్టేషన్‌లో ఆగింది. ఆ సమయంలో రైలు నుంచి దిగిన ఓ ప్రయాణికుడు చేతిలో బరువైన పెద్ద బ్యాగ్‌ను రైల్వేపోలీసులు గమనించారు. పోలీసులు ఆ వ్యక్తిని ఆపి, అతడి బ్యాగ్ తెరచి చూడగా దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆ బ్యాగ్‌లో రూ.500ల కరెన్సీనోట్ల కట్టలు, బంగారు బిస్కెట్లు, నగలు కనిపించాయి. వాటికి సంబంధించి ఆ వ్యక్తి వద్ద ఎలాంటి రశీదులు లేకపోవడంతో రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ వ్యక్తిని స్టేషన్‌కు తీసుకెళ్ళి విచారణ జరిపారు. ఆ నగలు, నగదు తరలిస్తున్న వ్యక్తి పుదుకోటకు చెందిన లక్ష్మణన్ అని, వాటిని అతడు మదురై తరలిస్తుండగా మార్గమధ్యంలో రైల్వే పోలీసులకు చిక్కాడు. రైల్వే భద్రతాదళం అధికారులు నగలు, నగదు పట్టుబడిన విషయాన్ని ఆదాయపు పన్నుల శాఖ అధికారులకు తెలిపారు. ఐటీ అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని నగలు, నగదు స్వాధీనం చేసుకుని వాటి విలువను అంచనా వేసేందుకు చర్యలు చేపట్టారు. ఐటీ సిబ్బంది లెక్కించగా రూ.15లక్షల నగదు, రూ.1.89కోట్ల విలువైన 2.45 కేజీల బంగారు కడ్డీలు, నగలు ఉన్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న నగదు, నగల విలువ రూ.2.04కోట్లని ఐటీ అధికారులు ప్రకటించారు. ఆ నగలు, నగదును మదురైలో ఎవరికి అందజేసేందుకు తీసుకెళుతున్నాడనే వివరాలను లక్ష్మణన్ నుంచి రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.



నగలు, నగదుతో పట్టుబడిన యువకుడితో పోలీసులు

## సమాచార దర్శిని

### నేడు విద్యుత్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, జూలై 10: తాంబరం డివిజన్ పరిధిలోని వెస్ట్ తాంబరం, ముల్లైనగర్, పుదుతాంగల్ ఉప విద్యుత్ కేంద్రాల్లో గురువారం ఉదయం 11 గంటలకు గ్రీవెన్స్ జరుగనుంది. ఈ గ్రీవెన్స్‌లో వినియోగదారులు పాల్గొని, తమ సమస్యలు పరిష్కారం పొందాలని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

### తక్కువ వడ్డీకి రుణాలు

ఐసిఎఫ్, జూలై 10: బీసీ, ఎంబీసీ, మైనార్టీలకు చిన్నవృత్తులు, వ్యాపారం చేసేందుకు తక్కువ వడ్డీకి రుణాలు అందజేయనున్నట్లు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ తెలిపారు. రాష్ట్ర బీసీ ఆర్థిక వనరుల అభివృద్ధి సంస్థ ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో బీసీ, ఎంబీసీ, మైనార్టీలకు వ్యక్తిగత, బృందాలకు తక్కువ వడ్డీకి రుణాలు అందజేస్తున్నామని, ఆసక్తి ఉన్న 18 నుంచి 60 ఏళ్లలోపున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కుటుంబ వార్షికాదాయం రూ.3 లక్షల్లోపు ఉండాలన్నారు. వివరాలకు http:// www.tabcedco.tn.gov.in/ అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

### ఆగస్టులో 8వ తరగతి పరీక్షలు

ఐసిఎఫ్, జూలై 10: ప్రైవేటు విద్యార్థుల 8వ తరగతి పబ్లిక్ పరీక్షలు ఆగస్టులో జరుగనున్నాయి. ఈ పరీక్షలు రాయాలనుకునేవారు ఈ నెల 18 నుంచి 24వ తేదిలోగా ప్రభుత్వ పరీక్షా కేంద్రాల సేవా కేంద్రాలకు వెళ్లి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇతర వివరాలకు www.dge.tn.gov.in/ అనే వెబ్‌సైట్ చూడవచ్చు.

### 15 జిల్లాల్లో కాంక్రీట్ గృహాలు

ఐసిఎఫ్, జూలై 10: 'కలైంజర్ కరుణానిధి ఇల్లం' పథకం కింద తొలివిడతగా 15 జిల్లాల్లో కాంక్రీట్ గృహాలు నిర్మించేందుకు రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో 8 లక్షల గుడిసెలను గుర్తించి వాటి స్థానంలో కాంక్రీట్ గృహాలు నిర్మించనున్నట్లు ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది.లక్ష గృహాలు తలా రూ.3.5 లక్షలతో నిర్మించేందుకు నిధులు కేటాయించింది. ఆ ప్రకారం, నీలగిరి, కోయంబత్తూర్, తిరుప్పూర్ సహా 15 జిల్లాల్లో జిల్లాకు తలా 3,000 నుంచి 4,000 గృహాలు నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు.

### కళాశాల మారే విద్యార్థుల ఫీజు తిరిగి చెల్లించాలి

ఐసిఎఫ్, జూలై 10: ఇతర కళాశాలలకు వెళ్లే విద్యార్థుల ఫీజును తిరిగి వ్వాలని యూజీసీ ఆదేశించింది. ఈ మేరకు కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు యూజీసీ పంపిన సర్క్యులర్‌లో... విద్యార్థులు ఒక కళాశాలలో చేరిన అనంతరం వేరే కళాశాలలు, ఇతర శాఖలకు బదిలీ అయితే, వారు ఇదివరకే అడ్మిషన్ కోసం చెల్లించిన ఫీజు తిరిగి అందజేయాలని, ఈ విధానాన్ని వర్సిటీలు, కళాశాలలు తప్పక పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించే విద్యాసంస్థల అంగీకారం రద్దు చేస్తామని యూజీసీ హెచ్చరించింది.

### 4,500 పాఠశాలలకు హెచ్‌ఎంలు లేరు

ఐసిఎఫ్, జూలై 10: రాష్ట్రవ్యాప్తంగా ప్రధానోపాధ్యాయులు లేని 4,500 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. రాష్ట్రంలో 38 జిల్లాల్లో 37,000 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. 4,500 స్కూళ్లలో హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిలో 2,994 ప్రాథమిక, మాధ్యమికపాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు లేరు. హెచ్‌ఎం బాధ్యతలను ఆ పాఠశాల డిగ్రీ, ఇతర టీచర్లు అదనంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ విషయమై ఉపాధ్యాయులు మాట్లాడుతూ... ప్రధానోపాధ్యాయులు త్వరలో భర్తీచేసే తమకు పనిభారం తగ్గుతోందని, అధికారులు ఈ విషయమై స్పందించాలని పేర్కొన్నారు.

### నేడు ద్రావిడర్ కళగం విద్యార్థుల సైకిల్ ర్యాలీ

ఐసిఎఫ్, జూలై 10: నీట్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ద్రావిడర్ కళగం విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో గురువారం సైకిల్ ర్యాలీ జరుగనుందని ఆ పార్టీ అధ్యక్షుడు కె.వీరమణి తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... నీట్ ప్రారంభమైనప్పటి నుంచి అవినీతి, అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. బడుగు వర్గాలకు చెందిన విద్యార్థుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయన్నారు. వివిధ పోరాటాలు చేపడుతున్న ద్రావిడర్ కళగం, గురువారం నుంచి 15వ తేది వరకు రాష్ట్రవ్యాప్తంగా నీట్ పరీక్ష రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థుల విభాగం ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీలు నిర్వహించనున్నామని తెలిపారు.

### 13న రేషన్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, జూలై 10: స్థానిక టి.నగర్, మైలాపూర్ సహా 19 మండల సహాయ కమిషనర్ కార్యాలయాల్లో రేషన్ కార్డుల సమస్యల పరిష్కార శిబిరాలు ఈ నెల 13వ తేది జరుగనున్నాయి. రేషన్ కార్డుల్లో పేరు చేర్చడం, తొలగించడం, చిరునామా, మొబైల్ నెంబర్ల మార్పు, ప్రజా పంపిణీలో అందిస్తున్న సేవల్లో అవకతవకలపై ఫిర్యాదులు, వస్తువుల నాణ్యతపై ఫిర్యాదులు తదితరాలు ఈ శిబిరాల్లో ప్రజలు తెలియజేయవచ్చని అధికారులు తెలిపారు.

### పర్యాటకులకు ప్రత్యేక రాయితీలు

ఐసిఎఫ్, జూలై 10: బృందాలుగా వెళ్లే పర్యాటకులకు ప్రత్యేక రాయితీలు కల్పించేనున్నట్లు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ తెలియజేసింది. చెన్నై పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పర్యాటకులకు వివిధ ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో, ఒకరోజు చెన్నై-మహాబలిపురం పర్యటనకు 10 మందికి పైగా టిక్కెట్లు బుకింగ్ చేసుకున్న పర్యాటకులు, దివ్యాంగులకు ఛార్జీ రాయితీ, బోట్ హౌస్ సేవలు, విడిదిలు ఛార్జీలు రాయితీ వంటివి కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

### సైనికుల పింఛన్ గ్రీవెన్స్ కేంద్రంగా చెన్నై

ఐసిఎఫ్, జూలై 10: రక్షణ మంత్రిత్వ శాఖ కుటుంబ పింఛన్ సమస్యల పరిష్కార ప్రధాన కేంద్రంగా చెన్నై ఎంపికైంది. మాజీ సైనికుల కుటుంబ సమస్యల పరిష్కార కేంద్రం ముంబై, అలహాబాద్‌లో ఉన్నాయి. ఇలాంటి కేంద్రాన్ని చెన్నైలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ ప్రకారం ఏర్పాటైన గ్రీవెన్స్ కేంద్రంలో పది రోజుల్లో 1,891 ఫిర్యాదులు స్వీకరించి, 1034 పరిష్కరించారు. ఈ గ్రీవెన్స్ ఈ నెలాఖరు వరకు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

### వ్యవసాయ వర్సిటీ ప్రవేశపరీక్ష రద్దు

ఐసిఎఫ్, జూలై 10: వ్యవసాయ విశ్వవిద్యాలయ పీజీ కోర్సులకు నిర్వహించనున్న ప్రవేశపరీక్ష రద్దయింది. కోయంబత్తూర్‌లోని ఈ వర్సిటీ ఆధ్వర్యంలో 46 అనుబంధ కళాశాలలున్నాయి. వర్సిటీలోని పీజీ కోర్సులకు ప్రవేశపరీక్ష జూన్ 29న జరిగింది. కోర్సుల్లో చేరేందుకు పలువురు విద్యార్థులు ఎదురుచూస్తున్న నేపథ్యంలో, ఈ పరీక్ష రద్దు చేస్తున్నట్లు తమిళనాడు వ్యవసాయ వర్సిటీ ప్రకటించింది. దీనికి సంబంధించి పరీక్ష దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ఈ-మెయిల్‌కు మంగళవారం రాత్రి సమాచారం పంపారు. విద్యార్థులు చెల్లించిన దరఖాస్తు రుసుము తిరిగి అందజేస్తామని వర్సిటీ వెల్లడించింది.

# కప్పలూరు టోల్‌గేట్ తొలగించాల్సిందే

● అన్నాడీఎంకే రాస్తారోకో

చెన్నై, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా తిరుమంగళం నియోజకవర్గం కప్పలూరు టోల్‌గేట్ తొలగించాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి ఆర్బీ ఉదయకుమార్ నాయకత్వంలో అన్నాడీఎంకే నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. గత వారం ఉన్నట్టుండి ఆ టోల్‌గేట్ రుసుము పెంచడంతో స్థానికులు ఆగ్రహం చెందారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం అన్నాడీఎంకే ఆధ్వర్యంలో స్థానికులు టోల్‌గేట్ రోడ్డుపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. దీంతో ఆ టోల్‌గేట్ వద్ద వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళన చేస్తున్న అన్నాడీఎంకే శ్రేణులు, స్థానికులను బలప్రయోగంతో తొలగించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో అందరినీ అరెస్టు చేసి వ్యాన్‌లలో తరలించారు. ధర్నా కారణంగా కప్పలూరు టోల్‌గేట్ వద్ద సుమారు మూడు గంటలపాటు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

**ఈపీఎస్ ఖండన...**

కప్పలూరు టోల్‌గేట్‌ను తొలగించాలని ధర్నా చేస్తున్న అన్నాడీఎంకే శ్రేణుల సహా స్థానికులను అరెస్టు చేయడం పట్ల ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఎక్స్ పేజీలో ఓ ప్రకటన విడుదల చేస్తూ దక్షిణాది జిల్లాల ప్రవేశద్వారంగా ఉన్న కప్పలూరులో టోల్‌గేట్ తొలగించాలని స్థానికులు కోరుతున్నారని, అంతే కాకుండా ఆ టోల్‌గేట్ రుసుము మిగతా టోల్‌గేట్ల కంటే రెట్టింపుగా, మూడింతలుంటున్నదన్నారు. ఇటీవల ఆ టోల్‌గేట్ రుసుమును ఉన్నట్టుండి పెంచడంతో స్థానికులు ఆగ్రహం చెందారని, న్యాయమైన కోర్కె కోసం ధర్నా చేసిన అన్నాడీఎంకే శ్రేణులను, స్థానికులను డీఎంకే ప్రభుత్వం అరెస్టు చేయడం గర్హనీయమని ఆ ప్రకటనలో ఈపీఎస్ పేర్కొన్నారు.



కప్పలూరు టోల్‌గేట్ వద్ద ధర్నా జరుపుతున్న అన్నాడీఎంకే నేతలు, కార్యకర్తలు, స్థానికులు

### జలాశయాల్లో రూ.120 కోట్లతో పూడికతీత

ఐసిఎఫ్, జూలై 10: భూగర్భ జలాలు పెంచడంతో పాటు వరదలు అడ్డుకొనేలా రూ.120 కోట్లతో 12 జలాశయాల్లో పూడికతీత చేపట్టనున్నట్లు సీఎండీఏ అధికారులు తెలిపారు. ఈ పథకంలో పెరుంబాక్కం, రెట్టేరి, ముడిచూర్, మాడంబాక్కం, సెంబాక్కం, అయ్యనంబాక్కం, వేళచ్చేరి, ఆదంబాక్కం, పుళల్, కొళత్తూర్ వంటి 12 జలాశయాల్లో పూడికతీత పనులు చేపట్టడంతో పాటు గట్లు పటిష్టపరచనున్నట్లు అధికారులు తెలిపారు.

### ఘనంగా సిపాయిల తిరుగుబాటు దినోత్సవం

వేలూరు, జూలై 10: సిపాయిల తిరుగుబాటు 218వ దినోత్సవం బుధవారం వేలూరులో ఘనంగా జరిగింది. సిపాయిల తిరుగుబాటు స్మారకార్థం నిర్మించిన స్థూపం వద్ద జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి పుష్పగుచ్ఛం వుంచి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమం లో వేలూరు ఎమ్మెల్యే కార్తికేయన్, గుడియాత్తం ఎమ్మెల్యే అమ్ములు విజయన్, జిల్లా ఎస్పీ మణివన్నన్, వేలూరు మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

### అన్నాడీఎంకే నేతకు సునీల్ నివాళి

చెన్నై, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే మహిళా విభాగ నేత, చెన్నై 136వ ఉప కార్యదర్శి ఎస్.సతీష్‌కుమార్ మాతృమూర్తి పద్మిని సుందరానికి 'ఎంజీఆర్ యువజన విభాగ సంయుక్త కార్యదర్శి డాక్టర్ సునీల్ మంగళవారం సాయంత్రం నివాళులర్పించారు. ఇటీవల కన్ను మూసిన ఆమె చిత్రపటాన్ని ఆవిష్కరించడంతో పాటు పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో అన్నాడీఎంకే నేతలు ఎస్ఆర్ సూర్య, రమేష్, ఆర్.కళయరసి, ఆర్.సహదేవి, ఆర్.దేవి, ఎ.కుమార్, టి.భారతి తదితరులు పాల్గొన్నారు.



పద్మిని సుందరానికి నివాళులర్పిస్తున్న సునీల్

### మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ వ్యవహారం

● ఇంకెన్ని రోజులు వాయిదాలు అడుగుతారు?
● ఈడీ న్యాయవాదిని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

అడయార్, జూలై10: అక్రమ నగదు లావాదేవీల కేసులో అరెస్టయిన మాజీ మంత్రి సెథిల్ బాలాజీ బెయిల్ పిటిషన్‌పై బుధవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఆ సమయంలో మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ తరపున న్యాయవాది రామ్ శంకర్ తన వాదనలు వినిపించారు. ఈ కేసులో ఈడీ అధికారులు ఉద్దేశ్యపూర్వకంగానే వాయిదాలపై వాయిదాలు అడుగుతున్నారని, ఇంకెన్ని రోజులు ఇలా వాయిదాలతో ఈకేసు సాగదీస్తారంటూ ప్రశ్నించారు. అయితే, ఈడీ తరపు న్యాయవాదులు మాత్రం తమకు మరికొంత సమయం కావాలంటూ కోరారు. ఇరు తరపు వాదనలు ఆలకించిన న్యాయమూర్తి అబ్బాస్ ఎస్ ఓకా సారథ్యంలోని ధర్మాసనం ఈ కేసు తదుపరి విచారణ శుక్రవారానికి వాయిదా వేసింది.

### ఉపాధి హామీ అమలుచేయాలని ఆందోళన

వేలూరు, జూలై 10: గుడియాత్తం పంచాయతీ యూనియన్ కార్యాలయంలో ఉపాధి కార్మికులు బుధవారం ఆందోళన చేపట్టారు. రైతు కార్మిక సంఘ జిల్లా సెక్రటరీ ప్రేమ్ కుమార్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పరమశివం, మణిఅరసన్, జీవానందం, కరుణానిధి తదితరులు పాల్గొన్నారు. 100 ఉపాధి పని కల్పించాలి, పనులు లేని సమయంలో నివారణ సహాయం అందజేయాలి సహా పలు డిమాండ్లతో ఆందోళన చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.



ఆందోళనలో కార్మికులు

### కొత్త చట్టాలు రద్దుచేయాలంటూ న్యాయవాదుల ధర్నా

వేలూరు, జూలై 10: స్థానిక కాట్పాడి రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం బార్ అసోసియేషన్, అడ్వొకేట్ అసోసియేషన్, పలు న్యాయవాదుల సంఘాల ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ,న్యాయవాదులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. కేంద్ర ప్రభుత్వంత నూతనం చేసిన మూడు చట్టాలు సత్వరం ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.



ధర్నా చేస్తున్న న్యాయవాదులు

### రూ.10 లక్షల నగదు స్వాధీనం

అడయార్, జూలై 10: స్థానిక ముత్యాల్‌పేటలో ఒక యువకుడి నుంచి రూ.10 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదు రవాణాకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో ఈ సొమ్ము హవాలా నగదుగా పోలీసులు భావిస్తున్నారు. ముత్యాలపేట పోలీసులు మంగళవారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో మద్యం సేవించి ద్విచక్రవాహనంపై వచ్చిన ఒక యువకుడిని ఆపి విచారించగా, పొంతనలేని సమాధానాలు చెప్పాడు. దీంతో అతన్ని అదుపులోకి తీసుకుని, స్టేషన్‌కు తరలించి విచారించారు. అతడి బ్యాగు తనిఖీ చేయగా అందులో రూ.10 లక్షలు ఉండటాన్ని గుర్తించారు. ఈ నగదుకు సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

### బన్రూట్టి సమీపంలో బయల్పడిన మట్టి నాణేలు

ఐసిఎఫ్, జూలై 10: కడలూరు జిల్లా బన్రూట్టి సమీపంలోని మరుంగూర్ గ్రామంలో జరిపిన పురావస్తు తవ్వకాల్లో మట్టి నాణేలు లభ్యమయ్యాయి. ఇదే గ్రామంలో చేపట్టిన పురాతన తవ్వకాల్లో ఇటీవల 10,11 శతాబ్దానికి చెందిన చోళుల కాలం నాటి రాగి నాణేలు లభించాయి. ఈ నేపథ్యంలో, మంగళవారం మట్టి నాణేలు కనుగొన్నారు. ఈ నాణేలు దొరికిన స్థలం నివాస ప్రాంతమని పురావస్తు పరిశోధకులు తెలిపారు. అలాగే, శివగంగ జిల్లా కీళడిలో మంగళవారం ఒకే గుంతలో రెండు కుండలు, మరో గుంతలో కుండ పెంకులు లభించాయి.



బయల్పడిన మట్టి నాణేలు

### సీపీఎం నేత కె.బాలకృష్ణన్ సోదరుడి మృతి

● సీఎం స్టాలిన్ సంతాపం

అడయార్, జూలై 10: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ సోదరుడు రాధాకృష్ణన్ అకాల మరణం పట్ల ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ మేరకు కె.బాలకృష్ణన్‌కు ఫోన్ చేసి తన సంతాపాన్ని తెలిపారు. రాధాకృష్ణన్ భౌతికంగా దూరమైన దుఃఖంలో ఉన్న ఆయన భార్యా పిల్లలకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు ముఖ్యమంత్రి విడుదల చేసిన తన సంతాప సందేశంలో పేర్కొన్నారు.

### రోటరీ క్లబ్ నూతన కమిటీ ఎంపిక

వేలూరు, జూలై 10: రోటరీ క్లబ్ ఆఫ్ వేలూరు వేగస్ తరపున 2024-25 సంవత్సరానికి నూతన కమిటీ ఎంపిక జరిగింది. తమిళనాడు ప్రైవేటు పాఠశాలల సంఘం రాష్ట్ర ఉప సెక్రటరీ విజయకుమార్ కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రూ.13,41,600 విలువైన నోటు పుస్తకాలు, విద్యా సామగ్రి అందజేశారు. అలాగే, దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, పలు సంక్షేమ సహాయాలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జార్జ్ సుందర్‌రాజన్, సురేష్, శివకుమార్, సతీష్, అమరేశన్, మంజుల తదితరులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన కమిటీ సభ్యులు

### నేత్ర శిబిరానికి స్పందన

వేలూరు, జూలై 10: జిల్లా అంధుల సంక్షేమ సంఘం, వేలూరు కంటి ఆస్పత్రి, శ్రీరామ్‌జీ బాబా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో విరింజిపురం పెరియ వీధిలోని నలమ్ ఆస్పత్రిలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని శ్రీరామ్‌జీ బాబా బాలాజీ ప్రారంభించారు. శక్తి అశ్వత్థరామన్, సీఎంసీ కంటి వైద్యులు డా.బేరన్, కంటి ఆసుపత్రి మేనేజర్ జాన్, దోపి, ఏలుమలై, నర్సులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు ఉచితంగా నేత్ర పరీక్షలు, మందులు అందజేశారు.



రామ్‌జీ బాబుకు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

### విద్యాశాఖ పనితీరుపై సమీక్ష

వేలూరు, జూలై 10: స్థానిక కలెక్టర్ కార్యాలయంలో బుధవారం విద్యాశాఖ పనితీరుపై సమీక్షా సమావేశం జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి మాట్లాడుతూ... డ్రాపౌట్ పిల్లలను గుర్తించి వారు తిరిగి పాఠశాలల్లో చేరేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా ప్రధాన విద్యాధికారి మణిమొళి, మహిళ పథక డైరెక్టర్ నాగరాజన్, వేలూరు రెవెన్యూ తహసీల్దార్ కవిత, జిల్లా ఆదిద్రావిడుదల సంక్షేమ శాఖ అధికారి రామచంద్రన్, జిల్లా ప్రాథమిక పాఠశాలల విద్యాధికారి దయాళన్, పలు శాఖ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

### త్వరలో రూ.100 కరుణానిధి స్మారక నాణేం

ప్యారీస్, జూలై 10: దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి వేడుకల సందర్భంగా రూ.100 విలువైన స్మారక నాణేలను విడుదల చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. కరుణానిధి స్మారక నాణేన్ని ఆయన జయంతి రోజైన జూన్ 3వ తేది శతజయంతి ముగింపు వేడుకల సందర్భంగా విడుదల చేయాలని గతంలో నిర్ణయించారు. అయితే కొన్ని కారణాల వల్ల కేంద్ర ప్రభుత్వం ఈ నాణెం ఆ రోజు విడుదల చేయలేదు. ఈ నేపథ్యంలో, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రూ.100 విలువైన కరుణానిధి స్మారక నాణెం విడుదల చేసేందుకు అనుమతిచ్చారని సచివాలయం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

### మెట్రోరైళ్ల సేవలకు అంతరాయం

పెరంబూర్, జూలై 10: స్థానిక విమానాశ్రయం నుంచి వింకోనగర్ మార్గంలో మెట్రోరైలు సేవలకు ఆటంకం కలిగింది. సాంకేతిక కారణాల రీత్యా మెట్రోరైలు సేవలు ఆగిపోయాయి. మరమ్మతులు పూర్తిచేసిన తర్వాత రైళ్లను యథావిధిగా నడుపుతామని చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) ఓ ప్రకటనలో తెలిపింది.

# నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జూలై 10: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

**వ్యాసర్పాడి:** మాత్తూర్ 1,2వ మెయిన్ రోడ్డు, ఎంఎండీఏ 1,3వ వీధులు, ఇండియన్ బ్యాంక్, టీఎన్ హెచ్‌బీ లేక్‌వ్యూ అపార్ట్‌మెంట్లు, వెలివట్ట రోడ్డు, ఇండస్ట్రియల్ గార్డెన్, పౌస్ నగర్, రోజ్ నగర్, ముంతాజ్ నగర్, శ్రీనివాస మోడ్రన్ టౌన్, పార్వతీపురం 1 నుంచి 3 వీధులు, అన్నై నగర్, సామువేలు నగర్ 2,3 వీధులు, ధనలక్ష్మి నగర్ 1,2 వీధులు, మంజంబాక్కం, గ్లోబ్ స్కూల్, వెట్రి నగర్

**మైలాపూర్:** కాలేజ్ రోడ్డు, కాలేజ్ లైన్, నుంగంబాక్కం హైరోడ్డు, మేఘన కుమారమంగళం వీధి, కేఎన్‌కే రోడ్డు, వల్లాస్ గార్డన్ 1 నుంచి 3 వీధులు, రాట్‌లండ్ గేట్ 1 నుంచి 6 వీధులు, సుబ్బారావు అవెన్యూ 1 నుంచి 3 వీధులు, కుమరప్ప వీధి

**అరుంబాక్కం:** చెన్నై మెట్రో రైలు కార్యాలయం, కోయంబేడు మార్కెట్, సేమాత్తమ్మన్ నగర్ 3వ సెక్టార్ ప్రాంతం, కోయంబేడు-పూందమల్లి హైరోడ్డు, శ్రీనివాస నగర్, సౌత్, నార్త్ మాడవీధులు, మేట్టుకుళం, న్యూ కాలని

**కేకే నగర్:** వలసరవాక్కం, జానకి నగర్ కొంత భాగం, ప్రకాశం కాలని కొంత బాగం, చౌదరి నగర్ కొంత భాగం, మేజిస్టిక్ కాలని, బేతన్యా నగర్ కొంత భాగం, అంబేడ్కర్ వీధి, రాజాజీ అవెన్యూ, అనెక్స్

**అంబత్తూర్:** తిరువేర్కాడు, కాలడి, వేలప్పన్ చావిడి, మాదర్వేడు, కో-ఆపరేటివ్ నగర్, నుంబాల్ రోడ్డు, పులియంబేడు రోడ్డు, రాజాస్ గార్డన్, జయ లక్ష్మి నగర్, బీహెచ్ రోడ్డు, కేట్టుపాళయం, కన్నంపాళయం, ఆయిల్‌సేరి, పాడి, కొరట్టూర్, టీఎంటీ నగర్, చర్చ్ రోడ్డు, కుబేర గణపతి వీధి, భారతిదాసన్ వీధి, సీరాలం వీధి, అన్నా వీధి, టీఐ సైకిల్స్, చోళాపురం మెయిన్ రోడ్డు, తిరేవేంగడ నగర్, వివేక్ నగర్, నెహ్రూ నగర్, ఇందిరా నగర్, గణపతి నగర్, కృష్ణాపురం ఎక్స్‌టెన్షన్, మాంతోపు ప్రాంతం, నొలంబూర్, మొగప్పేర్ వెస్ట్ 5వ బ్లాక్ నుంచి 8వ బ్లాక్ వరకు, కవిమణి రోడ్డు, అడయాళంపేట, వళ్లలార్ వీధి, ఐశ్వర్యం ఫేస్-1,2, అక్షయ హోమ్స్, వీజీఎన్ మౌంట్ మినర్వ, ఎస్పీ గార్డన్

**పల్లావరం:** పెరియార్ నగర్, ఫాల్సాన్ కంపెనీ, అన్నా రోడ్డు, కన్నయ్య వీధి, నీలకంఠన్ వీధి, తిరునీర్మలై మెయిన్ రోడ్డు, ఎంజీ రాజా వీధి, రెట్టమలై శ్రీనివాసన్ వీధి, లూర్ద్ మాతా వీధి, పీటర్ వీధి, సభాపతి వీధి, నరసింహన్ వీధి, అంబేడ్కర్ వీధి, జయమేరి వీధి, తిరునగర్, భజన ఆలయ వీధి, మారియమ్మన్ ఆలయ వీధి, శేష లైన్, కల్యాణిపురం, కోదండన్ నగర్, తెంద్రల్ నగర్, సెన్‌తమిళ్ రోడ్డు, వినాయకర్ నగర్, సర్వీస్ రోడ్డు, శ్రీనివాసపురం, లక్ష్మీనగర్, ఖాయిదేమిల్లత్ నగర్, సిలప్పదిగారం వీధి, మసీదు వీధి

**వేళచ్చేరి:** తరమణి, అధిపతి ఆసుపత్రి, గిరియాస్, తరమణి మెయిన్ రోడ్డు, సీటీఎస్ ఫ్లాట్స్, టాటా కన్సల్టెన్సీ, రామ్‌గిరి వీధి, బేబి నగర్, శాస్త్రిపురం, పార్క్ అవెన్యూ

**గిండి:** ఏజీఎస్ కాలని, శక్తి నగర్, బాలాజి నగర్ 1 నుంచి 15 వీధులు, నేతాజి కాలని 5 నుంచి 9 వీధులు, ఏజీఎస్ కాలని, వేల్ నగర్, తామరై వీధి, నవీన్ ఫ్లాట్స్, నేతాజి కాలని మెయిన్ రోడ్డు, ఎంజీఆర్ నగర్, గాంధీ నగర్, టైడల్ పార్క్, అడయార్ ఏరియా

**ఐటీసీ:** సిప్కాట్ సిరుచ్చేరి, ఎంజీఆర్ నగర్, ఎంజీ రోడ్డు, వీఎస్ఐ ఎస్టేట్, ఆర్ఎంఐ స్పాస్టిక్ సొసైటీ, జయంతి అవెన్యూ, వెస్ట్ అవెన్యూ, తరమణి బస్టాండ్, ఆర్ఎంజడ్-2, బయోడీజిల్, సీఎంఆర్ఎల్ తరమణి ఏరియా, కానగం, పెరియార్ నగర్, తిరువాన్మియూర్, ఇందిరా నగర్, ఎంజీఆర్ నగర్, ఎస్సార్పీ టూల్స్, వేళచ్చేరి, వీఎస్ఐ ఎస్టేట్ ఫేస్-1, 100 అడుగుల రోడ్డు, అన్నా నగర్, సీఎస్ఐఆర్ రోడ్డు, సీపీటీ ఏరియా, అజంతా టైడల్ పార్క్.

### అద్దె చెల్లించని 45 దుకాణాలకు సీలు

ఐసిఎఫ్, జూలై 10: స్థానిక టి.నగర్‌లో అద్దె చెల్లించని 45 దుకాణాలకు అధికారులు సీలు వేశారు. చెన్నై కార్పొరేషన్ ఆస్తి పన్ను, వృత్తి పన్నులు చెల్లించని వారిపై చర్యలు చేపడుతోంది. ప్రముఖ వ్యాపారులు రూ.లక్షల్లో ఆస్తి పన్ను బకాయిలుంచారు. వారికి నోటీసులు జారీచేసినా పన్ను చెల్లించడం లేదు. దీంతో, మండల పరిధిలోని టి.నగర్ రంగనాథన్ వీధిలో ఉన్న రెండు దుకాణాలకు బుధవారం ఉదయం అధికారులు సీలు వేశారు. అలాగే, డా.నాయర్ రోడ్డులో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో 43 దుకాణాలు కూడా సీలు వేశారు. పనగల్ పార్క్ ప్రాంతంలో ఉన్న మరో 57 దుకాణాలపై వచ్చే వారం చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

### ఏనుగు దాడిలో కార్మికుడి మృతి

ఐసిఎఫ్, జూలై 10: ఈరోడ్ జిల్లా భవానీసాగర్ సమీపంలో బుధవారం వేకువజామున అడవి ఏనుగు దాడిలో కార్మికుడు మృతిచెందాడు. తొప్పంపాళయం ప్రాంతానికి చెందిన కార్మికుడు కనకరాజ్ కాలకృత్యాలు తీర్చుకొనేందుకు సమీపంలోని తోటలోకి వెళ్లాడు. అక్కడున్న అడవి ఏనుగు హఠాత్తుగా అతనిపై దాడిచేసింది. తీవ్రంగా గాయపడిన కనకరాజ్‌ను సత్యమంగళం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స ఫలించక మృతిచెందాడు. ఈ ఘటనపై భవానీసాగర్ పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

### చెరువులోకి దూసుకెళ్లిన కారు

● వాచ్‌మేన్ మృతి

చెన్నై, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి సమయంలో ఓ కారు ప్రమాద వశాత్తు చెరువులోకి దూసుకువెళ్లడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా.. సిరుచేరిలో ఉన్న ఓ ఐటీ సంస్థలో బీహార్‌కు చెందిన కౌశల్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. ఆ సంస్థలో నైట్ డ్యూటీ చేసిన ఉద్యోగులు వెళ్లే కార్లలో కౌశల్ ఇంటికి వెళ్తుంటారు. ఆ మేరకు బుధవారం వేకువజాము 1.30 గంటలకు ఆ ఐటీ సంస్థ ఉద్యోగులు కొందరు నైట్ డ్యూటీ ముగించుకుని కారులో పల్లావరం బయలుదేరారు. ఆ కారులో కౌశల్ కూడా బయలుదేరాడు. కారును రాజశేఖర్ అనే డ్రైవర్ నడిపారు. ఉద్యోగులంతా వారిళ్ల వద్ద దిగిన తర్వాత కౌశల్‌ను ఇంటి వద్ద దింపేందుకు ఆ కారు బయలుదేరింది. పళ్ళికరణై వద్ద హఠాత్తుగా ఆ కారు అదుపు తప్పి రహదారి పక్కనే ఉన్న చెరువలోకి దూసుకెళ్లింది. వాచ్‌మేన్ కౌశల్ ఊపిరాడక కారులోనే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదం గురించి సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి వెళ్ళి కారులో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న డ్రైవర్ రాజశేఖర్‌ను కాపాడి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. నీట మునిగిన కారును కూడా అగ్నిమాపక దళం సభ్యుల సహాయంతో వెలికి తీశారు. పళ్ళికరణై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



చెరువులో నుంచి బయటకు తీసిన కారును పరిశీలిస్తున్న పోలీసు అధికారి

### 'ఆరుద్ర' డైరెక్టర్‌కు కోర్టులో చుక్కెదురు

● బెయిల్ పిటిషన్లు కొట్టేసిన హైకోర్టు

అడయార్, జూలై 10: ఆరుద్ర గోల్డ్ ఫైనాన్స్ కంపెనీ మోసం కేసులో ఆ కంపెనీ డైరెక్టర్లలో ఒకరైన రూసో తరపున దాఖలైన బెయిల్ పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. ఆయనకు బెయిల్ ఇచ్చేందుకు కూడా నిరాకరించింది. స్థానిక అంజికరై కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగిన ఆరుద్ర గోల్డ్ అండ్ ఫైనాన్స్ చందాదారుకు అధిక వడ్డీ ఆశచూపి కోట్లాది రూపాయల మేర మోసం చేసింది. దీనిపై పలు ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి.. పోలీసుల విచారణలో మొత్తం 9,255 మంది నుంచి రూ.2,438 కోట్ల మేర మోసం చేసినట్టు తేలింది. ఈ నేపథ్యంలో ఈ కేసులో ఆ కంపెనీ డైరెక్టర్లలో ఒకరైన రూసోతో పాటు మొత్తం 10 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో ఈ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ రూసో మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేయగా, దీనిపై న్యాయమూర్తి తమిళ్ సెల్వి బుధవారం విచారణ జరిపి... బెయిల్ ఇచ్చేందుకు నిరాకరిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది.

### మత్తు మాత్రల స్వాధీనం

● ఒకరి అరెస్టు

అడయార్, జూలై 10: స్థానిక ఎంకేబీ నగర్‌లోని ఒక ఇంటిలో అక్రమంగా నిల్వచేసిన 350 మత్తు మాత్రలతో పాటు రూ.7 వేల విలువ చేసే గంజాయి ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇంటిలో నివాసముండే అహ్మద్ ముస్తాఫాను అరెస్టు చేశారు. చెన్నై సెంట్రల్ క్రైం బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ ఖన్నా సారథ్యంలోని పోలీసులు మంగళవారం సాయంత్రం ఎంకేబీ నగర్ 16వ క్రాస్ వీధిలోని ఓ ఇంటికి వెళ్ళి అందులో నివసించే అహ్మద్ ముస్తాఫాను విచారించగా నెల రోజులుగా ఇంటిలో ఉంటున్నట్టు చెప్పాడు. పైగా ఈ ఇంటిలో ఉంటున్న మరో వ్యక్తి ఇంటిని ఖాళీ చేసి వెళ్ళిపోయినట్టు తెలిపారు. దీంతో సందేహించిన పోలీసులు ఆ ఇంటిని క్షుణ్ణంగా గాలించగా, మత్తుమాత్రలతో పాటు గంజాయి, గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

### బయో మైనింగ్ విధానంలో 95 శాతం చెత్త తొలగింపు : జీసీసీ

అడయార్, జూలై 10: స్థానిక పెరుంగుడిలోని డంపింగ్ యార్డు నుంచి 95 శాతం చెత్తను బయో మైనింగ్ విధానం ద్వారా తొలగిస్తున్నట్టు చెన్నై నగర పాలక సంస్థ వెల్లడించింది. పెరుంగుడి డంపింగ్ యార్డు సుమారుగా 225.16 ఎకరాల్లో గత 35 యేళ్ళుగా ఉపయోగంలో ఉందన్నారు. ఇక్కడ పోగయ్యే చెత్తను బయో మైనింగ్ విధానంలో శాస్త్రీయంగా 95 శాతం మేర తొలగించినట్టు తెలిపింది. ఇలా చెత్త తొలగించే సమయంలో మళ్ళీ ఉపయోగించే వస్తువులు ఏవైనా లభ్యమైతే వాటిని మళ్ళీ ఉపయోగిస్తున్నట్టు పేర్కొంది. ఈ డంపింగ్ యార్డులో సుమారు 34.02 లక్షల టన్నుల చెత్త పేరుకుందని, బయో మైనింగ్ విధానం ద్వారా త్వరితగిన పనులు పూర్తి చేస్తున్నట్టు జీసీసీ తెలిపింది. మూడేళ్ళ కాలపరిమితి కలిగిన ఈ ప్రాజెక్టు వ్యయం రూ.350.64 కోట్లు కాగా, ఇప్పటివరకు 95 శాతం పనులు పూర్తి చేయగా, మిగిలిన పనులను జూన్ నెలాఖరునాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెన్నై కార్పొరేషన్ పేర్కొంది.

### మంత్రి అనితా రాధాకృష్ణన్ కేసులో మాజీ స్పీకర్ ధనపాల్ సాక్ష్యం

పెరంబూర్, జూలై 10: మంత్రి అనితా రాధాకృష్ణన్‌పై ఉన్న అక్రమ ఆస్తుల కేసులో మాజీ స్పీకర్ ధనపాల్ బుధవారం తూత్తుకుడి జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్‌కు హాజరై సాక్షం చెప్పారు. అన్నాడీఎంకే ప్రభుత్వంలో 2001- 2006లో రాష్ట్ర మత్స్యశాఖ, జాలర్ల సంక్షేమం, పశుసంవర్ధక శాఖ మంత్రిగా వ్యవహరించిన అనితా రాధాకృష్ణన్, అప్పట్లో ఆదాయానికి మించి రూ.2.26 కోట్ల ఆస్తులు కలిగి ఉన్నారని, ఆయన, ఆయన భార్య, కుమార్తెలు, సోదరులు మొత్తం ఏడుగురికిపై 2006లో రాష్ట్ర అవినీతి నిరోధక, పర్యవేక్షణ విభాగం కేసు నమోదుచేసింది. ఈ కేసు తూత్తుకుడి జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ కేసు విచారణ తుదిదశలో ఉండగా, ఈ కేసులో తమను చేర్చాంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం దాఖలుచేసిన పిటిషన్‌ను ఈ నెల 3వ తేది న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ కేసును న్యాయమూర్తి కె.అయ్యప్పన్ బుధవారం విచారించారు అనితా రాధాకృష్ణన్‌పై కేసు నమోదుచేసి విచారించేందుకు 2011లో అప్పటి అసెంబ్లీ స్పీకర్ పి.ధనపాల్ అనుమతులిచ్చారు. అందువల్ల ధనపాల్ కూడా ఈ కేసులో ఒక సాక్షిగా ఉన్నారు. ఈ కేసులో హాజరై సాక్ష్యమివ్వాలని న్యాయస్థానం జారీచేసిన ఉత్తర్వులతో, బుధవారం మాజీ స్పీకర్ న్యాయస్థానానికి హాజరయ్యారు. ఆయనను సుమారు రెండు గంటల విచారణ అనంతరం, తదుపరి విచారణ ఈ నెల 24వ తేదీకి న్యాయమూర్తి వాయిదావేశారు.



కోర్టుకు హాజరైన మాజీ స్పీకర్ ధనపాల్

### బస్సు డ్రైవర్, కండక్టర్ సస్పెన్షన్

ప్యారీస్, జూలై 10: స్టాపింగ్ వద్ద బస్సు ఆపకుండా వెళ్లిన ప్రభుత్వ బస్సు డ్రైవర్, కండక్టర్లపై సస్పెన్షన్ వేటుపడింది. తిరువళ్లూర్-చెంగల్పట్టు బస్సు మార్గంలో సింగపెరుమాళ్‌కోయిల్ మీదుగా 82సి అనే ప్రభుత్వ బస్సు నడుపుతున్నారు. ఈ మార్గంలో సింగపెరుమాళ్‌కోయిల్, తెల్లిమేడు, ఆపూర్, సేందమంగళం, వడక్కుపట్టు, ఒరగడం తదితర ప్రధాన బస్టాపులున్నాయి. వీటిలో ఆపూర్ బస్టాండ్ నుంచి దాసరి కుండ్రత్తూర్, వలయాకరనై తదితర గ్రామాల నుంచి ఉద్యోగులు, విద్యార్థులు ప్రభుత్వ బస్సులో ప్రయాణిస్తుంటారు. ప్రతిరోజు 8 నుంచి 9 గంటల వరకు ఈ మార్గంలో వెళ్లే ప్రభుత్వ బస్సులను ఆపూర్ బస్టాండ్‌లో ఆపకుండా వెళ్తున్నాయంటూ స్థానికులు ధర్నా నిర్వహించారు. దీంతో ప్రభుత్వ రవాణా శాఖ అధికారులు తెల్లిమేడు, ఆపూర్ బస్టాండ్ల వద్ద ప్రయాణికుల ను విచారించారు. విచారణ అనంతరం ఆపూర్ బస్టాండ్ బస్సు ఆపకుండా వెళ్లిన డ్రైవర్ యువరాజ్, కండక్టర్ భాస్కర్‌లను తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## చిత్రజ్యోతి



## శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని చెప్పలేం

**దర్శకుడు అమీర్**

కల్తీసారా మరణాలు, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యను కారణంగా చూపి రాష్ట్రంలో శాంతిభద్రతలు నశించాయని చెప్పలేమని సినీ దర్శకుడు అమీర్ అన్నారు. నగరంలో జరిగిన 'యోలో' చిత్ర ప్రారంభోత్సంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, 'ప్రపంచ వ్యాప్తంగా డ్రగ్ కల్చర్ పెరిగిపోతుంది. ఒక్క తమిళనాడులోనే మాదకద్రవ్యాల విక్రయాలు జరుగుతున్నాయని చెప్పడం ఒక రకమైన రాజకీయమే. దేశంలో ఉత్తరాది రాష్ట్రాల్లో మరీ ముఖ్యంగా గుజరాత్ రాష్ట్రంలోని ఓడరేవుల్లో టన్నుల కొద్దీ డ్రగ్స్ దిగుమతవుతున్నాయి. వీటన్నింటితో పోల్చితే మన రాష్ట్రంలో శాంతిభద్రలు కొంతమేరకు అదుపులోనే ఉన్నాయనే చెప్పొచ్చు. రాష్ట్రంలో పటిష్ఠమైన శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. గతంలో కూడా రాజీవ్ గాంధీ, పళనిబాబా వంటి పలువురు హత్యకు గురయ్యారు. ఇలాంటి సంఘటనలు జరిగివుండకూడదు. అలాగే, కల్తీ సారా తాగి మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ప్రకటించడాన్ని నేను ఏకీభవించను. అయితే, తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లను ప్రభుత్వం ఆదుకోవాలి. కల్తీసారా తాగి అస్వస్థతకులోనై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని వివిధ రాజకీయ పార్టీల నేతలు పరామర్శించడం కూడా సమంజసం కాదు. కల్తీ సారా సేవించకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలి' అని పేర్కొన్నారు.

## ఆ వయసు రాగానే నటనకు గుడ్‌బై

**● తుషార విజయన్**



తనకు 35 యేళ్లు రాగానే నటనకు, సినిమాలకు గుడ్‌బై చెప్పాలని వుందని యంగ్ హీరోయిన్ తుషార విజయన్ వెల్లడించారు. ధనుష్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం 'రాయన్'. ఈ నెల 26వ తేదీన తమిళం, తెలుగు భాషల్లో విడుదలకానుంది. ఈ చిత్రం ఆడియో రిలీజ్ నగరంలో తాజాగా జరిగింది. ఇందులో తుషార విజయన్ మాట్లాడుతూ, 'తనకు 35 యేళ్ళ వయసు రాగానే సినిమాలకు గుడ్‌బై చెప్పాలని ఉంది. ఆ తర్వాత ప్రపంచ దేశాలన్నీ చుట్టేయాలన్న కోరికగా ఉంది. ప్రపంచంలో పర్యటించని దేశమంటూ ఏదీ లేదని చెప్పుకునేలా వరల్డ్ టూర్ ఉండాలని ఆశ పడుతున్నాను. నేను ధనుష్ వీరాభిమానిని. అలాంటి ఆయనతో కలిసి నటించడం మాటల్లో వర్ణించలేనిది. ఆయనతో కలిసి పనిచేయాలన్న కల ఇంత త్వరగా నెరవేరుతుందని ఊహించలేదు. నా కెరీర్‌లో ఈ సినిమా ఓ మైలురాయిగా నిలుస్తుందని భావిస్తున్నాను' అని పేర్కొన్నారు.



'ఇండియన్-2' లో కమల్ హాసన్

## 11 యేళ్ళ తర్వాత విశాల్ చిత్రం విడుదల ?

హీరో విశాల్ నటించిన ఒక చిత్రానికి 11 యేళ్ళ తర్వాత మోక్షం లభించనుంది. సుందర్ సి దర్శకత్వంలో విశాల్ నటించిన 'మద గద రాజా' చిత్రం ఇపుడు విడుదలకు సిద్ధమవుతున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఇందులో విశాల్ సరసన అంజలి, వరలక్ష్మి హీరోయిన్లుగా నటించగా, సంతానం, సరగోపన్ రమేష్ తదితరులు ఇతర పాత్రలను పోషించారు. విజయ్ ఆంటోనీ సంగీతం అందించారు. 11 యేళ్ళుగా అటకెక్కిన ఈ చిత్రాన్ని ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు దర్శక నిర్మాతలు సన్నాహాలు ప్రారంభించారు. ఇటీవల సుందర్ సి దర్శకత్వం వహించిన 'అరణ్మనై-4' చిత్రం ఘన విజయం సాధించింది. అందుకే ఈ చిత్రాన్ని రిలీజ్ చేసేందుకు దృష్టి కేంద్రీకరించారు. ఈ సినిమా విడుదల తేదీని త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.మరోవైపు విశాల్ కూడా 'మార్క్ ఆంటోనీ' చిత్రంతో ఘన విజయాన్ని సొంతం చేసుకోవడమేకాకుండా, అతని కెరీర్‌లోనే రూ.వంద కోట్ల క్లబ్‌లోకి చేరారు.. ప్రస్తుతం ఆయన స్వీయ నిర్మాణ దర్శకత్వంలో 'తుప్పరివాలన్-2'ను తెరకెక్కించే పనుల్లో నిమగ్నమైవున్నారు.



## 'ఇండియన్-2' విడుదలకు చిక్కులు?

శంకర్ దర్శకత్వంలో కమల్ హాసన్ హీరోగా నటించిన'ఇండియన్-2' చిత్రం ఈ నెల 12న విడుదలకానుంది. అయితే, ఈ సినిమా విడుదలకాకుండా స్టే విధించాలని కోరుతూ మదురై హెచ్.ఎం.ఎస్ కాలనీకి చెందిన మర్మ కళాకారుడు రాజేంద్రన్ మదురై జిల్లా నాలుగో మున్సిఫ్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో.. 'మంజా మర్మ కలై' పేరుతో ఆత్మరక్షణ శిక్షణ పాఠశాలను 55 యేళ్ళుగా నడుపుతున్నాను. 1996లో వచ్చిన 'ఇండియన్' సినిమా కోసం హీరో కమల్ హాసన్‌కు మర్మ కళలో శిక్షణ ఇచ్చాను. ఈ కళ అనేది ఒక రహస్య విద్య. అందుకే తొలిభాగం టైటిల్ కార్డులో నా పేరు వేశారు. ఇపుడు 'ఇండియన్-2'ను రూపొందించి, ఈ నెల 12వ తేదీన విడుదల చేయనున్నారు. అయితే, తొలి భాగం కోసం నేర్పించిన విద్య, శిక్షణ ఇతర రహస్యాలను ఇందులో ఉపయోగించారు. ఇందుకోసం నా వద్ద అనుమతి తీసుకోలేదు. అందువల్ల ఈ సినిమా టైటిల్ కార్డులో నా పేరును చేర్చాలని ఇప్పటికే నోటీసులు జారీచేయగా వారి వైపు నుంచి ఎలాంటి స్పందన లేదు.అందువల్ల ఇండియన్-2' చిత్రం విడుదలకాకుండా స్టే విధించాలని కోరుతున్నాను.' అని పేర్కొన్నారు. ఈ పిటిషన్ విచారణకు స్వీకరించిన కోర్టు గురువారానికి వాయిదా వేసింది.

## జంబుకేశ్వరాలయంలో మూడు దశాబ్దాల తర్వాత మోగనున్న గంట



రూ.12.5లక్షలతో తయారైన కంచు గంట

చెన్నై, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి సమీపం తిరువానైక్కావల్‌లో అఖిలాండేశ్వరి సమేత జంబుకేశ్వరాలయంలో మూడు దశాబ్దాల తర్వాత కంచుగంట మోగనుంది.. పరమేశ్వరుడు కొలువైన పంచభూత క్షేత్రాల్లో జల క్షేత్రంగా ఈ ఆలయం పేరొందింది. ఈ ఆలయంలో స్వామివారి సన్నిధి ద్వారం వద్ద మణిమండపం ఉంది. ఆ మండపం మధ్యలో భారీ కంచుగంట ఉండేది. స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగినప్పుడు ఆ గంట మోగించేవారు. అయితే 30 యేళ్ల క్రితం ఆ గంటకు బీటలు ఏర్పడింది. ఈ నేపథ్యంలో కొంతమంది దాతలు ఇచ్చిన రూ.12.50 లక్షల విరాళంతో కొత్త గంటను తయారు చేశారు. తిరువారూరు జిల్లా పేరలం ప్రాంతంలోని శీనివాస స్థపతి తయారు చేసిన ఈ కంచు గంట 520 కేజీల బరువు, 113 సెంటీమీటర్ల ఎత్తు, 287 సెంటీ మీటర్ల వ్యాసం కలిగి ఉంది. మంగళవారం రాత్రి శైవభక్తశిఖామణి మాణిక్కవాసగర్ తిరునక్షత్ర శుభమూహూర్తం సందర్భంగా మాణిక్కవాసగర్ ఉత్సమూర్తి ఊరేగింపులో ఈకొత్త గంటను కూడా ఊరేగించి ఆలయానికి చేర్చారు. బుధవారం మణిమండపం మధ్యలో ఈ కొత్త గంటను ఇంజనీరింగ్ నిపుణులు బిగించారు. ఈ నెల 12నుంచి రోజూ ఉచ్చికాల పూజ సందర్భంగా ఈ గంటను మోగించనున్నట్లు ఆలయ నిర్వాహణాధికారి రవిచంద్రన్ తెలిపారు.

## ఘనంగా పాండురంగస్వామి ఆలయ కుంభాభిషేకం



చెన్నై, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక అనకాపుత్తూరులో వందేళ్ల క్రితం నిర్మించిన పాండురంగ స్వామి ఆలయ కుంభాభిషేకం బుధవారం ఘనంగా జరిగింది. శ్రీపెరుంబదూర్ జీయర్ రామానుజర్ కుంభాభిషేకం నిర్వహించారు. ధనశేఖరస్వామి, ఏళుమలై తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కేబీ సుధాకర్, కేబీ సుబ్రమణి, బీఏ వీరభద్రం, నందగోపాల్ తదితరులు కుంభాభిషేక ఏర్పాట్లను పర్యవేక్షించారు. డాక్టర్ కుమార్ తదితర ప్రముఖులు ఈ కుంభాభిషేకంలో పాల్గొన్నారు. కాగా మధ్యాహ్నం 1500 మందికి అన్నదానం నిర్వహించారు.

## గ్రానైట్ క్వారీల్లో ఆక్రమణలు నిజమే

**ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన కమిషన్**



మంత్రి దురైమురుగన్‌కు నివేదిక అందజేస్తున్న జస్టిస్ జ్యోతిమణి బృందం

చెన్నై, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లాలోని గ్రానైట్ క్వారీల్లో ఆక్రమణలు నిజమేనని రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ పి.జ్యోతి మణి నేతృత్వంలోని కమిషన్ నిగ్గు తేల్చింది. మదురై జిల్లాలోని 83 గ్రానైట్ క్వారీల్లో పలు సంస్థలు చుట్టుపక్కల భూములను ఆక్రమించాయనే ఆరోపణలపై నిగ్గు తేల్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది ఫిబ్రవరి 20న జస్టిస్ పి.జ్యోతిమణి, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అడిషనల్ డైరెక్టర్ జనరల్ (రిటైర్డ్) భాస్కరన్, అదనపు డైరెక్టర్ (రిటైర్డ్) సుదర్శనంతో కూడిన కమిషన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ కమిషన్ వివిధ మార్గాల్లో విచారణ జరిపి నివేదిక రూపొందించింది. బుధవారం సచివాలయంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దురైమురుగన్‌ను కలిసి నివేదిక సమర్పించారు. ఈ కార్యక్రమంలో సహజ వనరుల శాఖ అదనపు ముఖ్య కార్యదర్శి కె.ఫణీంద్రరెడ్డి, జియాలజీ, గనుల విభాగం కమిషనర్ ఎ.శరవణవేల్ రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ నివేదికను పరిశీలించిన అనంతరం ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలను కూడా కమిషన్ సూచించినట్లు సమాచారం.

## కొత్త క్రిమినల్ చట్టాలకు నిరసనగా

# నాగర్‌కోయిల్‌లో న్యాయవాదుల రాస్తారోకో



మన్నార్గుడిలో రైలురోకో చేస్తున్న న్యాయవాదులు

చెన్నై, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఎలాంటి చర్చలకు తావులేకుండా, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా మూడు కొత్త క్రిమినల్ చట్టాలను అమల్లోకి తెచ్చినందుకు నిరసన తెలుపుతూ కన్నియాకుమారి జిల్లా నాగర్‌కోయిల్ న్యాయవాదులు రాస్తారోకో నిర్వహించారు. కొత్త క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా రైలు రోకో నిర్వహించనున్నట్లు న్యాయవాదుల సంఘం ప్రకటించడంతో రైల్వేస్టేషన్ వద్ద పోలీసులు మోహరించారు. ముందుగా నాగర్‌కోవిల్ కోర్టు నుంచి సుమారు మూడు వందల మంది న్యాయవాదులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా, కొత్త క్రిమినల్ చట్టాలను నిరసిస్తూ నినాదాలు చేస్తూ ఊరేగింపుగా రైల్వేస్టేషన్‌వైపు బయలుదేరారు. అప్పటికే రైల్వేస్టేషన్ వద్దనున్న పోలీసులు బారికేడ్లు పెట్టి వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వాటిని దాటుకుని రైల్వేస్టేషన్‌లో చొరబడేందుకు న్యాయవాదులు ప్రయత్నించారు. రోడ్డుపై బైఠాయించిన న్యాయవాదులను పోలీసులు వ్యాన్లలో తరలించారు. ఈ సంఘటన కారణంగా నాగర్‌కోవిల్ రైల్వే స్టేషన్ ప్రాంతమంతటా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి.

### మన్నార్గుడిలో రైల్ రోకో

తమిళనాడు, పుదుచ్చేరి న్యాయవాదుల సంఘం ఇచ్చిన పిలుపుమేరకు తిరువారూరు జిల్లా మన్నార్గుడిలో బుధవారం ఉదయం న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి రైల్ రోకో నిర్వహించారు. మన్నార్గుడి - మైలాడుదురై ప్యాసింజర్ రైలుకు అడ్డంగా పట్టాలపై నిలబడి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మన్నార్గుడి న్యాయవాదుల సంఘం నాయకుడు ఇలంశేఖరన్ ఆందోళనకు నాయకత్వం వహించారు. రైలును నిలిపివేయడంతో ప్రయాణికులంతా తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రైల్వే పోలీసులు జోక్యం చేసుకుని అందరినీ అక్కడి నుంచి పంపించేశారు. అరగంట ఆలస్యంగా మైలాడుదురై ప్యాసింజర్ అక్కడకి నుండి బయలుదేరింది.



ఆందోళన చేస్తున్న వారిని అదుపుచేస్తున్న పోలీసులు

## రామేశ్వరంలో కొనసాగుతున్న జాలర్ల సమ్మె

**● చేపల వ్యాపారులకు రూ.3 కోట్ల నష్టం**



రామేశ్వరం రేవులో పడవలుంచుతున్న జాలర్లు

చెన్నై, జూలై 10 (ఆంధ్రజ్యోతి): చేపలకు గిట్టుబాటు ధర నిర్ణయించాలని, చేపలవేటకు వెళ్లే జాలర్లపై శ్రీలంక నావికాదళం చేస్తున్న దాడులను నిరోధించాలని డిమాండ్ చేస్తూ రామనాథపురం జిల్లా రామేశ్వరం జాలర్లు చేస్తున్న సమ్మె బుధవారం మూడో రోజుకు చేరింది. రామేశ్వరం చేపలరేవు నుంచి ప్రతి రోజూ 560కి పైగా మరపడవల్లో నాలుగువేలకు పైగా జాలర్లు చేపలవేటకు వెళ్తుంటారు. జాలర్లు తీసుకొచ్చే చేపలను టోకు వ్యాపారులకు విక్రయిస్తుంటారు. ఇలా రోజువారీ చేపల వ్యాపారంలో 10 వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధిపొందుతుంటారు. ఈ నేపథ్యంలో చేపల వేట నిషేధ కాలానికి ముందున్న ధరల కంటే తక్కువ ధరలకు చేపలవ్యాపారులు చేపలు కొనడంతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ పరిస్థితులలో రాష్ట్ర మత్స్యశాఖ అధికారులు చేపలకు గిట్టుబాటు ధర నిర్ణయించాలని, చేపలవ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడటాన్ని కూడా అడ్డుకోవాలనే డిమాండ్‌తో మత్స్యకారులు మూడు రోజుల క్రితం నిరవధిక సమ్మె ప్రారంభించారు. రామేశ్వరం చేపల రేవు వద్ద గత మూడు రోజులుగా ఐదువందలకు పైగా మరపడవలను నిలిపి ఉంచారు. ఇదిలా ఉండగా మత్స్యకారుల సంఘం నాయకులు మాట్లాడుతూ మూడు రోజులుగా చేస్తున్న సమ్మె కారణంగా చేపల వ్యాపరంలో రూ.3 కోట్లకు పైగా నష్టం ఏర్పడిందని, ఇకనైనా ప్రభుత్వం స్పందించి చేపలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

## చిదంబరం ఆలయంలో కనకసభ నుంచి దర్శనం ప్రారంభం



చిదంబరం ఆలయంలోని కనకసభ ప్రవేశద్వారంలో వెళుతున్న భక్తులు

చెన్నై, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రం చిదంబరం నటరాజ స్వామి ఆలయంలో బుధవారం ఉదయం కనకసభపై నిలబడి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులను అనుమతించారు. ఆ ఆలయంలో ఆణి తిరుమంజన ఉత్సవాల సందర్భంగా భక్తులు కనకసభపై నిలిచి స్వామివారిని దర్శించేందుకు అనుమతించాలని, ఆలయ నిర్వాహకులు అడ్డుకుంటే దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు వారిపై కఠిన చర్యలు చేపట్టాలని హైకోర్టు ధర్మాసనం హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైకోర్టు ధర్మాసనం ఉత్తర్వుల ప్రకారం చిదంబరం ఆలయ దీక్షితార్లు భక్తులను కనకసభ ప్రవేశద్వారం నుంచి వచ్చేందుకు అనుమతించారు. దీంతో భక్తులు బారులు తీరి కనకసభ వేదికపై నిలిచి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఏళ్ల తరబడి ఆ ఆలయంలో దీక్షితార్లు మాత్రమే కనకసభ ప్రవేశద్వారంలో వెళ్ళి కనకసభ వేదికపై నిలిచి స్వామివారిని దర్శించుకునేవారు. ఇటీవలి కాలంలో సామాన్య భక్తులకు కూడా కనకసభ ద్వారా స్వామివారి దర్శనం కల్పించాలని దేవాదాయ శాఖ ఆలయ నిర్వాహకులకు పలుమార్లు విజ్ఞప్తి చేసింది. చివరకు ఈ అంశం హైకోర్టు దాకా వెళ్ళింది. ప్రస్తుతం సింగిల్ జడ్జి కనకసభ ప్రవేశద్వారంలో భక్తులను అనుమతించే విషయమై తుది తీర్పు వెలువరించాల్సి ఉంది.

## కాటన్, సిల్క్ ఫ్యాబ్ ప్రదర్శన ప్రారంభం

చెన్నై, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపేటలోని వైఎంసీఏ మైదానంలో 'కాటన్ అండ్ సిల్క్ ఫ్యాబ్ ప్రదర్శన' ప్రారంభమైంది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన చేనేత కళాకారుల నుంచి నేరుగా ఈ ఉత్పత్తులను కొనుగోలు చేసి విక్రయాలకు అందుబాటులో వుంచారు. ఈ నెల 17వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనను సందర్శకులు ఉదయం 10.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు వీక్షించవచ్చు. ఈ ప్రదర్శనలో ఒడిసా, సంబల్‌పూర్, ఇక్కత్ సిల్క్ చీరలు, బిహార్ ఆర్గానిక్ టస్సార్ సిల్క్ చీరలు, సూట్, స్టోల్స్, అసోం చీరలు, ఏరి సిల్క్ చీరలు, కర్ణాటక క్రేప్ సిల్క్, జార్జెట్ సిల్క్, ఆరణి సిల్క్, ప్రింటెడ్ చీరలు, కాంచీపురం సిల్క్ చీరలు, ధర్మవరం, ఉప్పాడ, గద్వాల్, మంగళగిరి, పోచంపల్లి, మలబారి సిల్క్, జందాని, జమావర్ సిల్క్ చీరలు, సిఫాన్ సిల్క్, మహారాష్ట్ర డిజైన్ డ్రెస్ మెటీరియల్స్, ప్రత్యేక రా సిల్క్ చీరలు, కోసా సిల్క్, టస్సార్ దుప్పట్టా, మధ్యప్రదేశ్ మహేశ్వరి, చందేరి సిల్క్ చీరలు, జమ్మూకాశ్మీర్ చినాన్ సిల్క్ తదితరాలన్నీ అందుబాటులో వున్నాయి.



చీరలను పరిశీలిస్తున్న మహిళలు



చెన్నై కాశిమేడు చేపలరేవు వద్ద యంత్రాల ద్వారా సముద్రంలో వ్యర్థాలను తొలగిస్తున్న కార్మికులు



తూత్తుకుడి జిన్‌ఫ్యాక్టరీ రోడ్డులోని కార్పొరేషన్ మాధ్యమిక పాఠశాలలో ఉపాధ్యాయులకు టాబ్‌లను పంపిణీ చేసేందుకు వెళ్ళిన మంత్రి గీతాజీవన్, ఎంపీ కనిమొళికి డప్పులతో స్వాగతం పలుకుతున్న విద్యార్థులు



అమెరికాలోని సాన్ అంటోనియా నగరంలో మురుగునీటి వ్యర్థాల శుద్ధీకరణ ప్లాంట్‌ను అక్కడి అధికారులతో కలిసి పరిశీలిస్తున్న గ్రేటర్ చెన్నై మేయర్ ఆర్. ప్రియా

## ముల్లై పెరియార్ డ్యామ్‌లో జారిపడిన ఏనుగు



డ్యామ్ షట్టర్‌గేట్ వద్ద నీటి ప్రవాహంలో చిక్కుకున్న ఏనుగు

చెన్నై, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ముల్లై పెరియార్ డ్యామ్‌లో బుధవారం ఉదయం తేక్కడి అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఓ ఏనుగు కాలుజారి ఆ డ్యామ్‌లోని నీటిని విడిచిపెట్టే షట్టర్ గేట్ సమీపంలో పడింది. ఆ ఏనుగు అరుపులు విని ప్రజాపనుల శాఖ అధికారులు పెరియార్ పులులు అభయారణ్య ప్రాంతం అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ అటవీ శాఖ అధికారులు సిబ్బందితో వెళ్ళి డ్యామ్ నుంచి నీటిని నిలిపివేసి సుమారు గంటపాటు శ్రమించి ఆ ఏనుగును గట్టెక్కించి కాపాడారు. ఆ తర్వాత ఆ ఏనుగు మళ్ళీ తేక్కడి అటవీ ప్రాంతంలోకి పరుగులు తీసింది.

## ఐవోసీ ట్యాంకర్ల సమ్మె

**● నగరంలో పెట్రోల్ కొరత!**



తండయార్‌పేట ఐవోసీ యూనిట్ వద్ద నిలిచిపోయిన ట్యాంకర్లు

చెన్నై, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ యాజమాన్యం తమ పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ చెన్నై, ఆసనూరు పెట్రోలియం ట్యాంకర్ లారీ యజమానుల సంఘం ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం ఉదయం నగరంలో ట్యాంకర్ లారీలు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. ఈ సమ్మె కారణంగా నగరంలోని పలు బంకుల్లో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడింది. కొన్ని పెట్రోలు బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తున్నాయి. తండయార్‌పేట, ఎన్నూరు ప్రాంతాల్లో ఉన్న ఐఓసీ యూనిట్ల వద్ద 200లకు పైగా పెట్రోల్ లారీలను నిలిపి ఉంచారు. ఈ సమ్మె గురించి ట్యాంకర్ లారీ యజమానుల సంఘం నాయకుడొకరు మాట్లాడుతూ.. 15 రోజుల్లోగా తమ న్యాయమైన కోర్కెలను ఐవోసీ యాజమాన్యం ఆమోదించకపోతే సమ్మెను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. తమకు మద్దతుగా భారత్ పెట్రోలియం, హిందూస్థాన్ పెట్రోలియం సంస్థల ట్యాంకర్లు కూడా సమ్మెలో పాల్గొనే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు.







బుధవారం జరిగిన విక్రవాండి నియోజకవర్గ ఉప ఎన్నికలో సాయుధ బలగాల పహారా నడుమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరిన ఓటర్లు